

వైవీయూలో పీజీ ప్రవేశాలు



ప్రవేశ ప్రక్రియను పరిశీలిస్తున్న విసి సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్: వేమన విశ్వవిద్యాలయంలో పీజీ ప్రవేశాల ప్రక్రియతో విద్యార్థుల సందడి నెలకొంది. వైవీయూ పి జి సెట్-2023 రాసి అర్హత సాధించిన రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన డైరెక్టర్ ఆచార్య కంకణాల గంగయ్య ఆధ్వర్యంలో నిర్వ హించారు. విసి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రవేశాల ప్రక్రియను పరిశీలించారు. సజావుగా కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా సంచాలకుల ఆచార్య గంగయ్య మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా వైవీయూకు ఆప్షన్ ఇచ్చుకున్న విద్యార్థుల వివరాలు విసి దృష్టికి తెచ్చారు. 10వ తేదీ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ అసోసియేట్ డైరెక్టర్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ శ్రీధర్ బాబు, శ్రీధర్‌రెడ్డి, ఆచార్య కాత్యాయిని, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, డాక్టర్. రామకృష్ణ, ఆచార్య వి.సునీత, సహ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస గౌడ్, డాక్టర్ గణేష్ నాయక్ సంచాలకుల సిబ్బంది పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఓ కుటుంబం మల్లెలలోని దర్గా దర్గా దర్శనానికి ఆటోలో కడప నగర సమీపంలోని ఆజాద్‌నగర్ నుంచి బయలుదేరింది. ప్రొద్దుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి మల్లెలకు పయనమయ్యారు. ఎర్రగుంట్ల పట్టణ సమీపంలోని ఓ కల్యాణ మండపం వద్దకు ఆటో రాగానే ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి వేగంగా వచ్చి ఢీకొంది. ఆటో కాస్త తునాతునకలైంది. వాహనంలోని వారందరూ చెల్లాచెదురుగా పడిపోయారు. ఆ దృశ్యం చూసిన వారందరి గుండెలు ఝల్లుమన్నాయి. మృతదేహాలను చూసి, క్షతగాత్రుల ఆహాకారాలు వింటూ కళ్లు చెమ్మగిల్లాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు.



బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఆటో



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

- ఆటోను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు
- కడపకు చెందిన నలుగురు దుర్మరణం
- మృతుల్లో భార్యాభర్తలు
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- గాయపడిని వారిని పరామర్శించిన ఆర్‌డిఒ, డిఎస్‌పి



సంఘటనా స్థలంలో రోధిస్తున్న మృతుల బంధువులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డు బైపాస్ వద్దనున్న ఎస్‌వి కల్యాణ మండపం వద్ద సోమవారం ఆటోను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే.. పులివెందుల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శ్రీశైలం వెళుతుండగా ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్ల వైపు వస్తున్న ఆటోను బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోలో మహిళా డ్రైవర్‌తో సహా 10 మంది ప్రయాణిస్తుండగా అందులో డ్రైవర్ అమీనా(20), షాకీర్ (10), మహమ్మద్(25), హసీనా(25) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సిఐ ఈశ్వరయ్య, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు ఒకరికొకరు బంధువులు కావడంతో సమాచారం అందుకున్న మృతుల బంధువులు మృతదేహాల వద్ద రోధిస్తున్నారు. బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతి చెందిన మహమ్మద్, హసీనా భార్యాభర్తలు కడప నగరం ఆజాద్ నగర్ కాలనీకి చెందిన వారు. మహమ్మద్ కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. ప్రొద్దుటూరులోని తమ బంధువుల ఇంటికి వెళ్లి అక్కడి నుంచి మల్లెల గ్రామంలోని దర్గా దర్శనానికి అందరూ కలిసి ఆటోలో బయలుదేరారు. ప్రొద్దుటూరు నుండి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న ఆటో ఎస్‌వి కల్యాణ మండపం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్టేక్ చేయబోయే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతుల బంధువులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

క్షతగాత్రులను పరామర్శించిన ఆర్‌డిఒ

ఆర్‌టిసి బస్సు, ఆటోను ఢీకొన్న ఘటనలో గాయాలపాలై ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురిని జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు పరామర్శించారు. ప్రమాద ఘటన గురించి ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రొద్దుటూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులకు సూచించారు.

ప్రమాదం దురదృష్టకరం : డిఎస్‌పి

ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు పరామర్శించారు. ప్రమాదఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

దేశంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

- ఎపిడబ్ల్యూజెఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు రాజు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సంఘ సేవకులు సలావుద్దీన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని దాని జీవనాధారమైన భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులు, ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కడం మోడీ పాలనలో కొత్తేమీ కాదన్నారు. భారత దేశాన్ని హిందుత్వ-ఫాసిస్ట్ నియంతృత్వంలోకి వేగంగా లాగడం, దానిని వ్యతిరేకించే వారిని అణిచి వేయడం నిరంతర ఎత్తుగడని తెలిపారు. బిజెపి ప్రభుత్వ విమర్శకులను దేశద్రోహులుగా చిత్రీకరించి జైలుకు పంపడం పరిపాటిగా మారిందని విమర్శించారు. చారిత్రాత్మక రైతాంగ సమ్మెకు మద్దతు ఇచ్చినందుకు దిశా రవిని అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో స్వేచ్ఛాయుత మీడియా కార్యకలాపాలను లేకుండా చేసేందుకు ఈ విధమైన ఉగ్రవాదానికి తెరలేపారని విమర్శిం చారు. ఇది భారతదేశంలోని మీడియా స్వేచ్ఛ వాస్తవ స్థితిని వెల్లడిస్తుందని పేర్కొన్నారు. నిజాన్ని మాత్రమే ప్రజలకు చేరవేసే మీడియా సంస్థలు, జర్నలి స్టులపై ఇంత పెద్ద ఎత్తున నిరంకుశ దాడి చేయడం ఆమోదయోగ్యం కాదని హెచ్చరించారు. ప్రజల తరపున ఉద్యమిస్తున్న మీడియాను లక్ష్యంగా చేసుకుని వారిని హింసించటం, అణిచివేసేందుకు చేస్తున్నటువంటి కుట్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య భావాలు కలిగిన ఈ దేశపు పౌరులు, దేశభక్తులందరూ ఐక్యంగా ఉద్యమించాలి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ 'న్యూస్ క్లిక్' కార్యాలయం, జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి జర్నలిస్టుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కెమెరాలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. సీనియర్ జర్నలిస్టులను కూడా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఫాసిస్టు ఎత్తుగడలను ఎదిరించి మానవ హక్కుల కోసం పోరాడిన అనేక మందిని మోడీ పాలనలో తప్పుడు కేసులు బనాయించి, దేశద్రోహ నేరారోపణలు చేసి జైలుకు పంపారని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు మన్సూరు అక్బర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, రాయలసీమ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు మల్లెల భాస్కర్, లోక్ సత్తా నాయకులు కృష్ణ ప్రసంగించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, పత్రికా విలేకరులు, మీడియా ప్రతినిధులు సిద్దయ్య, నారాయణ, మురళి, నందకుమార్, వనం శర్మ, నాగేందర్‌రెడ్డి, బాషా, వెంకటేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఓబులేసు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



యువగర్జనకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకులు

యువగర్జనకు మద్దతుగా సంఘీభావ దీక్ష

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలంటే పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని రాజంపేట నియోజకవర్గ జనసేన యువ నాయకులు అతికారి దినేష్ పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం యువ నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన యువగర్జన దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు వీర మహిళలతో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలోని యువతీ, యువకులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు, గల్ఫ్ దేశాలకు వలసలుగా వెళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకునేందుకు పవన్ కళ్యాణ్ కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఆయనకు అవకాశం ఇస్తే రాబోయే ఎన్నికల్లో టిడిపితో కలిసి రాష్ట్రంలో అధికారం చేపట్టి వారిని ఆదుకుంటామని స్పష్టం చేశారు. జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌కు అవకాశం ఇస్తే యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భాస్కర్ పంతులు, కోలాటం హరి, నాగార్జున, ఓబులేష్, రామ శ్రీనివాస్, గోపి, వెంకటయ్య, ఆచారి, చౌడయ్య, వెంకటేష్, గోపాల్, జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌కు సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మేజర్ పంచాయతీ తొలి ముస్లిం మహిళా సర్పంచ్ షేక్ జీనత్ షఫిని ప్రజా సంఘాలు, క్రైస్తవ మత పెద్దలు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. సోమవారం వారు స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ, ప్రజా సంఘాలు, పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డులోని ఏసిఎల్ఎం చర్చ్ పాస్టర్ బృందం కొత్తగా నియమితులైన సర్పంచును కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ జీనత్ షఫీ మంచి సేవాభావం, దాన గుణం కలిగిన వ్యక్తి అని అన్నారు. వారి ప్రవేట్ సంస్థల్లో ఎంతో మంది పేద ప్రజలకు ఆశ్రయం కల్పించి అండగా నిలిచారని అన్నారు. అదేవిధంగా ఎంతోమంది పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాలు, తాగునీటి సమస్యలను సొంత నిధులతో పరిష్కరించారని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక రాయలసీమ రీజనల్ కన్వీనర్ చీకటిపల్లి రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షులు బెల్లం రమేష్, జిల్లా కార్యదర్శి మద్దెల రమేష్, ప్రజా సంఘాల సీనియర్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, జంపే విజయ్, యువ నాయకులు సద్దల ప్రేమ్ కుమార్, మాల మహానాడు ఐక్యవేదిక పీలేరు మండల సంయుక్త కార్యదర్శి పల్లం నారాయణ, ఇటుకల రెడ్డప్ప, వెంకట్ నాగులు, సి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.



సర్పంచును సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై శ్రద్ధ పెట్టి ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి, డిఆర్‌ఒ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

విప్లవ కెరటం చే గువేరా : ఎస్‌ఎఫ్‌ఐ



చే గువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎగిసే విప్లవ కెరటం చేగువేరా అని, యువత ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని, విభజన హామీల అమలు కోసం యువత చే స్ఫూర్తితో పోరాటాలలో భాగస్వామ్యం అవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉపేంద్ర అన్నారు. సోమవారం చేగు వేరా వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అమెరికా సామ్రాజ్యవాదనికి ఎదురొడ్డి, క్యూబా పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరుడు చేగువేర అన్నారు. డాక్టర్ వృత్తిలో వుండి పేదల కోసం అహర్నిశలు కష్టపడి గెరిల్లా పోరాట ఉద్యమాలు నిర్వహించి సామ్రాజ్య వాదుల చేతిలో వీరమరణం పొందాడని తెలిపారు. చేగువేరని అందరూ చే అని పిలుస్తా రన్నారు. 1967, అక్టోబర్ 9న అమెరికా సామ్రా జ్యవాదుల చేతిలో వీర మరణం పొందాడని పేర్కొన్నారు. ప్రస్తుతం యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడు కుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమను విస్మరించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని రాష్ట్ర హక్కుల కోసం మోడీ దగ్గర తాకట్టు పెట్టిందన్నారు. మతోన్మాదం పేరుతో దేశంలో అణగారిన వర్గాల పై దాడులు, అత్యా చారాలు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. యువత హక్కుల కోసం పోరాడటానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కళాశాల కమిటీ సభ్యులు గోవర్ధన్, హరి, అంజి పాల్గొన్నారు.

'కాన్షీరామ్ మార్గంలోనే విసికె పోరాటం'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్, నారాయణ గురు, బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రభోదాలతో బహుజన సమూహాలను రాజ్యాధికారం వైపు నడిపి విజయాలు సాధించిన గొప్ప రాజకీయ విప్లవ యోధుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని, అయన చూపిన మార్గంలో బహుజనులకు రాజ్యాధికారం సాధించడానికి విసికె పార్టీ విరోచితంగా పోరాడుతోందని, ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక బాస్ కార్యాలయం వద్ద కాన్షీరామ్ వర్ధంతి కార్యక్రమాన్ని విసికె పార్టీ, బాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా నేతలు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ మెజార్టీ ప్రజలైన బహుజనులు రాజ్యాధికారం సాధించాలన్న అంబేడ్కర్ ఆకాంక్షను కాన్షీరామ్ సాధ్యం చేసి, దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కు దళిత మహిళ మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేశారని, నేడు వీసీకే అధినేత కాన్షీరామ్ మార్గంలో నడుస్తూ తమిళనాడు రాజకీయాల్లో పెనుసంచలనం సృష్టిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పు కోసం వీసీకే పార్టీ సైద్ధాంతిక ఉద్యమాన్ని కొనసాగిస్తున్నదని చెప్పారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎస్బీఐ చీఫ్ మేనేజర్ వి. మునివెంకటప్ప తోపాటు విసికె, బాస్ నాయకులు చాట్ల బయన్న, గిన్నెల మనోహర్ రెడ్డి, పెద్దపాలెం రవిశంకర్, సొన్నికంటి రెడ్డెప్ప పాల్గొన్నారు. **బిఎస్‌పి ఆధ్వర్యంలో** కాన్షీరామ్ వర్ధంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ నాయకత్వంలో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిఎస్‌పి మదనపల్లి అధ్యక్షులు రమణ, బాలాజీ, గంగాధర్, శ్రీనాథ్, శివ, అనిల్, లక్ష్మీపతి, ప్రసాద్, పాల్గొన్నారు. **పీలేరు:** ఆత్మగౌరవానికి మారు పేరు కాన్సీరామ్ అని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. బాస్ కార్యాలయంలో కాన్సీరామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, నాయకులు యర్రబెల్లి మల్లికార్జున, వెంకటరెడ్డి, హరినాథ, ముల్లంగి గురవయ్య, ప్రసాద్ పాల్గొన్నారు. **రాయచోటి :** కాన్సీరామ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు యుగంధర్, బహుజనాలు పాల్గొన్నారు.



మదనపల్లె : కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విసికె నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అధికమైన వైసిపి అరాచకాలు

- మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో ప్రజలు అభద్రతా భావంతో వున్నారని మదనపల్లి మాజీ శాసనసభ్యులు షాజహాన్ బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా జీవించటానికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులు రాష్ట్రంలో లేవని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు విషయంలోనూ ప్రభుత్వానికి స్పష్టత లేదని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు నాయుడు అంగళ్ళు పర్యటనలో భాగంగా తనతో నిరంతరం ఉండే వారు షంషీర్, ఇంతియాజ్, ఖాజా, వెంకటేశ్వర ప్రసాద్, రఘుపతి నాయుడులు ఆ రోజు 4వ తేదీ ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడికి రాలేదనిమ తెలిపారు. తిరగలేదు, ఎవరినీ కలవలేదన్నారు. అయితే వీళ్లంతా కేసులో ముద్దాయిలుగా వున్నారని పేర్కొన్నారు. కేసుకు సంబంధం లేని వారిపై కేసులు నమోదు చేయడం అంటే అరాచకం తాండవం ఆడుతోందని అగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగళ్లు ఘటనలో వైసిపి చేసిన గొడవల్లో లేనటువంటి నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని తెలిపారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు అక్కడికి వచ్చి గొడవలు సృష్టించిన పోలీసులు, స్పందించపోవడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగ్గిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. వైసిపి పతనం ప్రారంభమైందని తెలిపారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి బాలు స్వామి,నాదెళ్ల శివ, షంషీర్, నాగూర్ వలి, నవీన్ చౌదరి, సంఘం హరి, శంకర్ నాయుడు, వరుణ్, పూలకుంట్ల హరిబాబు, వేమయ్య, ఇంతియాజ్, మల్లికార్జున నాయుడు, రెడ్డి, శేఖర్, సైదు, రసూల్, జబి, మోహన, గురు, నాగమణి, హసీనా, రెడ్డిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి నియమాలు తప్పక పాటించాలి : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రహదారి నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని వన్ టౌన్ సిఐ ఎస్‌మహబూబ్ బాషా తెలిపారు. అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కేశప్ప ఆధ్వర్యంలో శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ అవేర్నెస్ రహదారి భద్రత సదస్సుకు మహబూబ్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి రహదారి నియమాలు పాటించాలని తెలిపారు. అప్రమత్తతతో డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాల నివారించవచ్చునని పేర్కొన్నారు. మితిమీరిన వేగం నిర్లక్ష్యం కారణంగా చాలా మంది రోడ్లపై తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కన్నవారికి గర్భశోకాన్ని మిగిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. తమ విలువైన జీవితాలు కాపాడుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ సైబర్ నేరాలు వాటిని ఎలా ఎదుర్కోవాలో ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐ హేమాద్రి, ప్రిన్సిపల్ రమాదేవి, టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ డిజి రామమూర్తి, మహిళా పోలీసులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎండియు ఆపరేటర్లు

బియ్యం పంపిణీకి సర్వర్ సమస్యలు

-తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎండియు ఆపరేటర్ల నిరసన

ప్రజాశక్తి-కలికిరి

బియ్యం పంపిణీకి సర్వర్ సమస్యగా మారడంతో ఎండియు ఆపరేటర్లు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండియుల యూనియన్ నాయకుడు మదార్ మాట్లాడుతూ ఈ నెల తొమ్మిది రోజులు గడిచిపోయినా కూడా మండలంలో ఎక్కడ కూడా బియ్యం పంపిణీ సక్రమంగా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సర్వర్ సమస్యతో ఒక గ్రామంలో రెండు, మూడు రోజులు సమయం పడుతుండడంతో కార్డు దారులు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను తట్టుకోలేక ఎండియూ ఆపరేటర్లు బియ్యం బండితో తహశీల్దార్ కార్యాలయం గేటులో అడ్డంపెట్టి సర్వర్ సమస్యల పరిష్కరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ భాగ్యలతకు వినతిపత్రం సమర్పించారు. తహశీల్దార్ స్పందించి సర్వర్ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో మండలంలోని ఎండియూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో డిడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లె



భోజనాన్ని పరిశీలిస్తున్న డిడి జాకీర్‌హుస్సేన్

మండలంలోని జికెంచపల్లి బాలుర, బాలికల వసతి గృహాలను సోమవారం సాంఘిక సంక్షేమశాఖ డిడి జాకీర్‌హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అనే హెచ్‌డబ్ల్యూఒలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం విద్యార్థుల ఉదయం ఏడు గంటలకే వచ్చి విద్యార్థులకు అందించే అల్పాహార భోజనాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్‌లో వసతి గృహం లోనే ఉండడంతో అభినందించారు. విద్యార్థులకు అందాల్సిన దుప్పట్లు, ప్లేట్లు, పెట్టెలు, విద్యాసామగ్రి అంది చారా లేదా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు తేవాలని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులు కావాలని ఎవ్వరూ కూడా ఫెయిల్ కాకూడదని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణసాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రెడ్డయ్య, బాలికల హాస్టల్ వార్డెన్ లావణ్య, సుండుపల్లె వార్డెన్లు పాల్గొన్నారు.



నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని కడప-చెన్నై హైవే వద్ద కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి, రాష్ట్ర ఎస్‌సెల్ కన్వీనర్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ రైల్వే కోడూరు సమన్వయ కమిటీ కన్వీనర్ షేక్ అల్లాబకాష్ ఆధ్వర్యంలో 20 మంది హమాలీలు కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. కష్టకాలంలో ఉన్న పార్టీని అభి వృద్ధి పథంలో నడపటానికి తాన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి భారత్ జోడో యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొని భావితరాల భవిష్యత్తుకు రాహుల్ గాంధీ నాందిగా నిలిచారని కొనియాడారు. 2024లో రాహుల్ ప్రధాని కావడం తథ్యమన్నారు. కార్యక్ర మంలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాధ్యక్షులు డాక్టర్ సయ్యద్ బాషా, హరికృష్ణరెడ్డి, బొమ్మన బోయిన నాగరాజు, వెంగయ్య, సిగమాల రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మానవత సంస్థ ప్రతినిధి జి.రామచంద్రారెడ్డి సౌజన్యంతో బి.కొత్తకోట మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన యం.యశస్విని మొదటి బహుమతి రూ.2500, ద్వితీయ బహుమతి జి.ప్రదీప్ కుమార్‌రెడ్డి, రూ.1500, ద్వితీయ బహుమతి వై.రవళి మార్కులు రూ. 1500 లను రూ.5500 అందించారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వ హిస్తున్నామని, భవిష్యత్తులో వీటిని మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రోత్సాహక బహుమతులను ప్రధా నోపాధ్యాయుల చేతుల మీదుగా అందజేసిన జి.రామచంద్రారెడ్డికి, మానవత సంస్థకు ధన్య వాదాలు తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో హెచ్‌ఎం. కాంతారావు, మానవత ప్రతినిధులు యన్. క్రిష్ణారెడ్డి, జి.రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

అప్రమత్తంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఆటో డ్రైవర్లకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం అతి వేగము వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి, అనేక మంది వికలాంగులు అవుతున్నారని, మృత్యువాత పడుతున్నారని అన్నారు. యువకులందరూ విధిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని, వాహనాలను నడిపేటపుడు హెల్మెట్ ఖచ్చితముగా ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు మద్యము సేవించి వాహనాలు నడుపరాదని, ప్రమాదాలు జరుగకుండా అన్ని జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. అధిగ శబ్దాలను కలిగించే సైలెన్సర్లను బిగుంచుకొని ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్థిం చరాదన్నారు. శబ్ద కాలుష్యాన్ని కలిగించే వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. రోడ్డు నియమాలను, నిబంధనలను పాటించని వారిపై కటిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించినారు.

వ్యర్థాలతో నిండిన ఆర్‌టిసి బస్టాండ్

- అసౌకర్యానికి గురవుతున్న ప్రయాణీకులు

ప్రజాశక్తి-గాలివీడు



వ్యర్థ పదార్థాలతో నిండుకున్న ఆర్‌టిసి బస్టాండ్

మండల కేంద్రం గాలివీడులోని ఆర్‌టిసి బస్టాండు ఆవరణం వ్యర్థ పదార్థాలు, చెత్తా చెదారంతో నిండి ఉండటంతో ప్రయాణీకులు అసౌకర్యానికి గురౌతున్నారు. బస్టాండులో పనిచేసే కార్మికులకు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించక పోవడంతో పారిశుధ్య పనులు చేయడం మానేశారు. దీంతో బస్టాండు ఆవరణం ప్లాస్టిక్ వ్యర్థాలు, టీకప్పులు, చెత్తాచెదారంతో నిండిపోయింది. మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు మూసివేయడంతో ప్రయాణికులతో పాటు మహిళా కండక్టర్లకు వస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు దృష్టిపెట్టి ఆర్‌టిసి టెండర్లను స్థానికులకు కేటాయిస్తే ఎంతో అనుకూలండా ఉంటుందని చెబుతున్నారు. ఆర్‌టిసి బస్టాండు ఆవరణాన్ని పారిశుధ్య పనులకు చర్యలు తీసుకొని, మరుగుదొడ్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

పేదల ఆరోగ్యానికి భద్రత 'ఆరోగ్య సురక్ష' : ఎంపిపి



నందలూరు: అంగన్వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నల్ల తిమ్మయ్యగారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ గీతాలశిరీష, నరసింహారెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదవారికి ఆరోగ్యాన్ని అందించాలని మంచి సంకల్పంతో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా చేసుకోవాలని ఎంపిపి కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, జడ్‌పిటిసి గడికోట ఉషా, సుబ్బారెడ్డి, రైతుసంఘం నాయకుడు గీతాలనరసింహారెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారిని సృజన, దాదిరెడ్డి నరసారెడ్డి, రామచంద్రయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు. **రామాపురం :** ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపిడిఒ హైదరవలి, వైద్యాధికారి విజయ్‌కుమార్‌లు అన్నారు. మండలం లోని గోపగుడిపల్లె సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వాటి ప్రాధాన్యత గురించి ప్రజలకు ప్రజలకు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్ కుమార్, వినోద్‌కుమార్, మాజీ సర్పంచ్ సుబ్బయ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కోసమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. సోమవారం మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీలో సర్పంచ్ రెడ్డి రామ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 35 మంది రోగులకు రక్త పరీక్షలు, షుగర్, బిపి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబురెడ్డి, మద్దిరాల మల్లికార్జున సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం రేణు మకుల పల్లెలో సర్పంచ్ మహమ్మద్‌అలీ, ఎంపిటిసి సభ్యులు మహేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ ల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ఆశయంగా వినూత్న తరహాలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. డాక్టర్లు అనుపమ , ఆశాలత లుమి సిమ్లాలు పలు రకాల పరీక్షలతో వైద్య చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించేందుకు పెద్ద ఆసుపత్రికి రెఫర్ చేశారు.



విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఎంఇఒ చక్రేనాయక్

పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెంచండి :ఎంఇఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని ఎంఇఒ చక్రేనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాలెంగొల్లపల్లెలో మామిరెడ్డి గారిపల్లె, చిన్న పోతులపల్లె, ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక మధ్యాహ్న భోజన పథకం బిల్లులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు నైతిక విలు వలను, విద్యా ప్రమాణాలను పెంపొందించాలన్నారు. ఉపాధ్యాయులను సమయపాలన పాటించి సకాలంలో ఫేస్ యాప్ చేసుకో వాలన్నారు. మధ్యాహ్న భోజనంలో ఎలాంటి రాజీ పడకుండా మెనూ ప్రకారం పిల్లలకు వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డయ్య పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై భక్తుల సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల సమీపంలోని మల్లయ్య కొండలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. భక్తులకు పూజారి ఈశ్వరప్ప మల్లికార్జున లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలను నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయానికి సమీపంలోని గౌరమ్మగుడిలో మహిళలు పెద్ద ఎత్తున సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి సన్నిధిలో సాష్టాంగ నమస్కారం తో వరపడ్డారు. ఉదయం గౌరీ మాత ఆలయం అర్చకులు శేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, సహస్రనామార్చన నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు.

అవార్డు గ్రహీత ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా వారి ఉన్నతికి అందించే ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ఎం.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ముబారక్‌బాషా, పఠాన్ మహమ్మద్ ఖాన్ లకు పౌర సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల ఉపాధ్యాయులను అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కడప,చిత్తూరు జిల్లాల జడ్‌పి చైర్మన్లు ఆకెపాటి అమరనాథరెడ్డి, శ్రీనివాసులు జిల్లా కలెక్టర్లు విజయ్‌రామరాజు, గిరీషలు, ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, డిఇఒలు పురుషోత్తం,రాఘవ రెడ్డిలు కడపలో ప్రాంతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చి గౌరవించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు,వారి సర్వతోముఖాభివృద్ధికి ఇరువురు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.వృత్తినే దైవంగా భావిస్తూ, అనునిత్యం పాఠశాల అభివృద్ధికి పాటుపడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న వారి సేవలు పలువురికి ఆదర్శనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యా యులను పూలమాలలు, దృశ్శాలువ, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.**రామాపురం :** ఈనెల అంత ర్జాతీయ ఉపాధ్యాయ దినో త్సవం సందర్భంగా ఆకే పాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో అవార్డు పొందిన ఎంపిపి స్కూల్ మేదరపల్లిలో పనిచేస్తున్న ఆర్‌వి సౌభాగ్యలక్ష్మికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాముల నాయక్, కమిటీ చైర్మన్, సభ్యులు తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయు రాలు తల్లిదం డ్రులకు, విద్యార్థులకు అతిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మురళి

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఆర్‌డిఒ


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రీడల ద్వారా మానసిక ఆనందం తో పాటు శారీరక ధృఢత్వం సాధ్యమని ఆర్‌డిఒ మురళి పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె జడ్‌పి హైస్కూల్ లో 67వ ఎస్‌జిఎఫ్ అంతర్ జిల్లా అండర్-19 బాలురు,బాలికల ఫుట్‌బాల్ పోటీల ముగింపు, బహుమతుల పంపిణీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సర్వ సాధారణమన్నారు. విద్యార్థులు తమ అభిరుచి మేరకు క్రీడలను ఎంచుకొని అద్భుతంగా రాణించాలన్నారు. విద్యతో పాటు అన్ని విభాగాల్లో రాణించినప్పుడే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిచారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గాయపడిన జనసైనికులకు పరామర్శ

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి వర్గీయుల దాడిలో గాయపడిన జన సైనికులను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనసే పార్టీ నాయకుడు మధుబాబు, అతని కుటుంబ సభ్యులను సోమవారం జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కలపరవి, పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్‌కుమార్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలమనేరులో వైసిపి గడప గడపకు కార్యక్రమంలో భాగంగా జనసేన మండల ప్రధాన కార్యదర్శి మధుబాబు ఇంటి దగ్గరకు వచ్చిన వెంకటేష్‌గౌడ్‌ను ఈ ప్రభుత్వంలో తనకు ఇల్లు ఇచ్చామన్నారని, ఆ జాగా ఎక్కడుందో తనకు చూపమని నిలదీసిన పాపానికి అతని కుటుంబ సభ్యులను కొట్టి గాయపరచడం దారుణమన్నారు. జన సైనికులపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు రవి, పీలేరు మండల అధ్యక్షుడు మోహన్ కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి గజేంద్ర, హరీష్ పాల్గొన్నారు.



గాయపడిన జన సైనికులను పరామర్శిస్తున్న జనసేన నాయకులు



స్టడీ మెటీరియల్‌తో ఉపాధ్యాయుడు రమణయ్య, విద్యార్థులు

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టీ. కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సోమవారం నాడు పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం. రమణయ్య సుమారు మూడు వేల రూపాయలు విలువ చేసే సాంఘిక శాస్త్రం మెటీరియల్ ను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కే.బబిత మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు అన్ని రకాలుగా విద్యార్థులను ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు రమణయ్య మాట్లాడుతూ విషయ నిపుణులచే తయారు చేయబడిన ఈ మెటీరియల్ కచ్చితంగా పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవడానికి దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, గిరిధర్, హేమలత,ప్రమీల, ప్రమీల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ప్రజాశక్తి-రామాపురం

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడితో పాటు అధిక లాభాలను అర్జించవచ్చని మండల ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ సూరం వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం తాను సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండించిన మిరప పైరు, వాటి వల్ల వచ్చే లాభాలు గురించి వివరించారు, ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతముతో పాటు మొక్కలు వ్యాధినిరోధక శక్తిని పెంపొందించి చీడపీడల నివారణ నుంచి తట్టుకోగలవన్నారు. భూమిలో రసాయనాలు బదులు జీవా మృతాలను ఉపయోగించి భూమి సారవంతం పెంచవచ్చని తెలిపారు. రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట పెట్టే ముందు ఒకే రకమైన పంట కాకుండా అంతర పటలను సాగుచేయడం వల్ల అధిక దిగుబడి పొందే అవకాశముందన్నారు. భూగర్భ జలాలను పెంచడం, దేశవాళీ ఆవు మలమూత్రాలతో అధిక లాభాలు ఉన్నాయని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు అధిక పోషక విలువలతో పాటు మార్కెట్లో అధిక గిరాకీ ఉంటుందని చెప్పారు. పంట పెట్టే ముందు దుక్కిలో జీవామృతం చల్లడం ద్వారా భూమి సారవంతంతో పాటు వానపాములు కూడా పెరుగుతాయని తెలిపారు. అంతేకాక పంటలో లింగా కర్షణ బుట్టలు ఉంచడం ద్వారా పంటను ఆశించే దోమల బారి నుండి రక్షించుకోవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతు రాజు కాగలరని అన్నారు.

టార్పాలిన్ పట్టలు అందజేత

ప్రజాశక్తి-వీరబల్లి



టార్పాలిన్ పట్టలు పంపిణీ చేస్తున్న ఎపిఎం ఖాదరవల్లి

మండలంలోని రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ చేస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి తెలిపారు. సోమవారం మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య ద్వారా రైతులకు తక్కువ ధరతో నాణ్యమైన పట్టలు పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క టార్పాలిన్ పట్టా రూ.1650 విలువ చేస్తోందన్నారు. కావలసిన రైతులు మీ గ్రామానికి సంబంధించిన రైతు మిత్రలకు తెలపాలని అన్నారు. కార్యక్రమంలో సిసిలు వెంకటలక్ష్మి, క్రిష్ణయ్య, నాగేంద్ర, మరియమ్మ, రాజు, రైతుమిత్ర జనమేజయుడు పాల్గొన్నారు.

ఎపిఎండిసి ఎమ్‌డిని కలిసిన 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విజయవాడ నగరంలోని ఎ॥నిఎండిసి కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ వి.జి వెంకటరెడ్డిని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు కలిసి మంగంపేట గ్రామ పంచాయతీలోని మూడు గ్రామాల తరలింపు, మౌలిక వసతుల కల్పన, పునరావాస గ్రామాలలో మౌలిక వసతులు తదితర అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ పాల్గొన్నారు.



ఎపిఎండిసి ఎమ్‌డితో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

క్రైం కార్నర్

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ బాలేవాండ్లపల్లెకు సమీపంలో గోపాల్ అనే వ్యక్తి నాటుసారాను తీసుకు వచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. అందిన సమాచారం మేరకు నాటుసారా విక్రయ స్థావరంపై దాడి చేసి గోపాల్‌ను అదుపులోకి తీసుకొని అతను వద్ద నుంచి15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

హత్యకేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. సోమవారం నిందితులను విలేకరుల ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలములోని కోన పంచాయితీ కోనకు చెందిన నాగరాజును అదే గ్రామానికి చెందిన చెంగలనాగయ్య, చెంగల శ్రీరాములు అనే ఇద్దరు అన్నదమ్ముళ్లు కత్తితో పొడిచి గాయపరిచినట్లు నాగరాజు భార్య లక్ష్మీదేవి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కత్తిపోటుకు గురైన నాగరాజ తిరుపతి ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ కేసులో నాగరాజ మృతికి కారకులైన నాగయ్య ,శ్రీరాములను కోన క్రాస్ వద్ద సోమవారం పట్టుకొని సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, తాతయ్య, రమేష్, రియాజ్ భాషా, మునిరాజా, కరుణాకర, డ్రైవర్లు రమేష్, అశోక్ పాల్గొన్నారు.